ప్రజాశక్తి

శనివారం 25 నవంబరు 2023



యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్‌పై అవగాహన

శ్రీకాకుళం అర్బన్ : బ్యాక్టీరియా, వైరస్‌లు, శిలీంధ్రాలు, పరాన్నజీవులు కాలక్రమేణా మారినప్పుడు, మందులకు ప్రతిస్పందించనప్పుడు యాంటీమైక్రోబయల్ నిరోధకత ఏర్పడి ప్రబలే అంటువ్యాధులకు చికిత్స అందించడం కష్టతరమవుతుందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. వ్యాధి వ్యాప్తి, తీవ్రమైన అనారోగ్యం, మరణాల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంటుందన్నారు. వీటిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రపంచ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ ముగింపు కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 18నుంచి 24వ తేదీ వరకు మెడికల్ కాలేజ్‌లు, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు, పిహెచ్‌సిల్లో సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ పేరుతో మానసిక వేధింపులు

- ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు
- ఇంక్రిమెంట్లు కట్ చేయడమే విద్యారంగ అభివృద్ధా?
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పాఠశాలల పర్యవేక్షణ పేరుతో విద్యాశాఖ ఉన్నతాధికారులు, కిందిస్థాయి అధికారులు ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు విమర్శించారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన యుటిఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడిని శిక్షించడమే పర్యవేక్షణ అన్నట్లు విద్యాశాఖ అధికారులు వ్యవహరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఏదో ఒక పేరుతో పై నుంచి కిందిస్థాయి అధికారుల వరకు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సందర్శించి వచ్చిన తర్వాత జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంఇఒలు మానిటరింగ్ టీమ్‌గా పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను దొంగలుగా చూస్తూ నోటీసులు జారీ చేస్తున్నారని తెలిపారు. ఆర్థికపరమైన ఇంక్రిమెంట్లను కట్ చేయడం విద్యారంగ అభివృద్ధికి ఎలా ఉపయోగపడుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ అంటే ఆ పాఠశాలలో పొరపాటు ఉంటే, దాన్ని సరిచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కోసం సూచన చేయాలన్నారు.

పొరపాటును సరిచేసుకునే అవకాశం ఇవ్వాలి గానీ అందుకు భిన్నంగా ఎక్కడ ఉపాధ్యాయుడు దొరుకుతాడా అన్న పద్ధతిలో పర్యవేక్షణ సాగుతోందని విమర్శించారు. ఎంత పనిఒత్తిడి ఉన్నా పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంలో కృషి చేస్తున్న ఉపాధ్యాయుల మనోధైర్యాన్ని పెంచాల్సింది పోయి, కోల్పోయేలా అధికారులు వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇలా చేయడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య రాదనే విషయాన్ని గమనించాలని సూచించారు. ఎక్కడైనా ఉపాధ్యాయుడు పొరపాటు చేస్తే మెమో ఇచ్చి దాన్ని సరిచేసుకునే అవకాశం ఇస్తారని, ఎలాంటి విచారణ లేకుండానే సరాసరి ఇంక్రిమెంట్లు కట్ చేయడం సరికాదన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అసలు ఉపాధ్యాయుల నుంచి ఏం ఆశిస్తున్నారో స్పష్టం చేయాలన్నారు. తల్లిదండ్రులు, పిల్లలు, అధికారుల ముందు ఉపాధ్యాయులను కించపరచడం ద్వారా నాణ్యమైన విద్య వస్తుందా అని ప్రశ్నించారు. బోధన సమయంలో ఎన్ని క్లిప్ ట్రైనింగ్స్, ఓరియెంటేషన్ క్లాసులు, స్కూల్ కాంప్లెక్స్, వీడియో కాన్ఫరెన్స్‌లు, రోజువారీ గణాంకాలు ఎంఆర్‌సిలకు అందజేయడం తదితర పనులను ఉపాధ్యాయులే చేస్తున్న విషయాన్ని గమనించాలన్నారు. ఇప్పటికైనా పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయుల మనోభావాలు, ఆర్థిక సౌకర్యాలను దెబ్బతీసే చర్యలను మానుకోవాలని సూచించారు. లేకుంటే భవిష్యత్తులో పర్యవేక్షణకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం చేపట్టక తప్పని పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర మాట్లాడుతూ పర్యవేక్షణ సందర్భంగా ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పలురకాల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు, సహాధ్యక్షులు ఎల్.బాబూరావు, కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యదర్శులు హెచ్.అన్నాజీరావు, వై.వాసుదేవరావు, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై ఆదిత్యుని విహారం

కన్నుల పండువగా తెప్పోత్సవం



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి లోని సూర్యనారాయణ స్వామి తెప్పోత్సవం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. ఉషా, ఛాయ, పద్మిణీ సమేత సూర్యనారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలను తొలుత మాఢ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యాన అర్చకులు ఉషా ఛాయ పద్మినీ సమేతుడైన సూర్యనారాయణ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అనివెట్టి మండపంలో వేడుకలను ప్రారంభించారు. స్వామి వారికి హారతి నివేదన పూర్తయిన తర్వాత స్వామివారిని తిరువీధి ఉత్సవానికి తీసుకెళ్లారు. కోలాటం, చెక్కభజనలు, మేళతాళాల మధ్య పల్లకిలో ఊరేగింపుగా ఇంద్రపుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. అక్కడ సిద్ధంగా ఉన్న హంస వాహనంపై ఉత్సవమూర్తులను ఉంచి పుష్కరిణిలో తిరువీధి కోలాహలం నడుమ నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా యాత్రికులు తరలివచ్చారు. ఇంద్రపుష్కరిణిలో తెప్పలను విడిచిపెట్టారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వేడుకల్లో ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్‌తో పాటు పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ జ్ఞాన సువర్ణరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజలకు మెరుగైన సేవలందించాలని శాశ్వత లోక్ అదాలత్ (ప్రజా ప్రయోజన సేవలు) ఛైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు సూచించారు. శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన హై లెవల్ కమిటీ సమావేశాన్ని న్యాయ సేవా సదన్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలకు భంగం వాటిల్లితే శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. ఇందుకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సి అవసరం లేదని స్పష్టం చేశారు. ఎటువంటి కేసులనైనా కేవలం రెండు నెలల్లో పరిష్కారమవుతాయన్నారు.

సివిల్ కోర్టుల్లో మాదిరిగా ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండబోదన్నారు. శాశ్వత లోక్ అదాలత్ ద్వారా అందిస్తున్న సేవల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి వ్యవస్థపై అధికారులు మరింత శ్రద్ధ వహించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శాఖలు, సంస్థల్లోని లోపాల కారణంగానే ప్రజలు కోర్టును ఆశ్రయిస్తారని, అటువంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో హౌసింగ్, మెప్మా, డ్వామా పీడీలు ఎన్.గణపతి, కిరణ్ కుమార్, జి.వి చిట్టిరాజు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన బస్సు యాత్ర

- ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్
- వృద్ధుడు మృతి



కృష్ణమూర్తి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఆమదాలవలస

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో ప్రధాన రహదారిపై శుక్రవారం నిర్వహించిన వైసిపి సామాజిక సాధికార యాత్ర సభతో ట్రాఫిక్ స్తంభించి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలంలోని లక్ష్ముడుపేటకు చెందిన గురుగుబెల్లి కృష్ణమూర్తి (65) మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పాలకొండ పట్టణంలో ప్రధాన రహదారిపై సాధికార సభ వేదిక, కుర్చీలను ఏర్పాటు చేయడంతో గురువారం అర్ధరాత్రి నుంచి పాలకొండ, పార్వతీపురం వైపు వెళ్లే భారీ వాహనాలు, లారీలను ఆమదాలవలస మున్సిపాల్టీ పరిధిలోని పార్వతీశంపేట జంక్షన్ వద్ద పోలీసులు నిలిపివేశారు. దీంతో పార్వతీశంపేట జంక్షన్ నుంచి బొడ్డేపల్లి పేట జంక్షన్ వరకు వాహనాలు బారులు తీరాయి. ఇదే సమయంలో లక్ష్ముడుపేటకు చెందిన గురుగుబెల్లి కృష్ణమూర్తి ప్రమాదవశాత్తు ఇంట్లో జారిపడి తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం ఇచ్చినా, రహదారిలో ట్రాఫిక్ కారణంగా రాలేకపోయింది. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన పట్టణ శివారులో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. రహదారికి అడ్డంగా చేపడుతున్న యాత్ర తమపాలిట శవయాత్రగా మారిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి 108 వాహనం వచ్చి ఉంటే బతికే అవకాశం ఉండేదని చెప్పారు. రహదారిపై సభలు, యాత్రల నిర్వహణపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.

అభివృద్ధే లక్ష్యంగా సమగ్ర మాస్టర్‌ప్లాన్

సుడా వైస్ ఛైర్మన్, జెసి నవీన్



మాట్లాడుతున్న జెసి నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం అభివృద్ధే లక్ష్యంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తున్నామని సుడా వైస్ ఛైర్మన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన మాస్టర్ ప్లాన్‌పై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం నగరంతో పాటు 11 మండలాలను అనుసంధానం చేస్తూ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించినట్లు తెలిపారు. దీనిపై సూచనలు, సలహాలు, అభ్యంతరాలను డిసెంబరు పదో తేదీలోగా తెలియజేయాలన్నారు. మాస్టర్‌ప్లాన్ వెలువరించిన తర్వాత 200 అభ్యంతరాలు వచ్చాయని, దీంతో గడువును మరో 15 రోజులు పెంచినట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు, ప్రముఖులు, మేధావులు స్పందించి సమగ్ర మాస్టర్‌ప్లాన్ తయారీకి సహకరించాలని కోరారు.

నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.ఓబులేసు మాట్లాడుతూ శ్రీకాకుళం మాస్టర్‌ప్లాన్ 20 ఏళ్ల కిందట రూపొందించారని, దాన్ని అప్‌డేట్ చేయడంతో పాటు భవిష్యత్‌లో మరో 20 ఏళ్ల పాటు ఈ మాస్టర్‌ప్లాన్ కొనసాగుతుందన్నారు. దీని ఆధారంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టేందుకు వీలుంటుందన్నారు. ముసాయిదా ప్లాన్‌పై శ్రీకాకుళం నగరపాలక సంస్థకు సంబంధించిన అన్ని విషయాలను పరిశీలించి కొన్ని సూచనలు, సలహాలను కార్పొరేషన్ తరపున ఇచ్చినట్లు తెలిపారు. సుడా మాస్టర్‌ప్లాన్‌పై ప్రజలకి అవగాహన కలిగించడంతో పాటు సలహాలు, సూచనల కోసం అన్ని వర్గాలతో సమావేశాన్ని నిర్వహించినట్లు చెప్పారు. సమావేశంలో సుడా అధికారి రామ్మోహన్, నగరపాలక సంస్థ అధికారులు, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఏం చేశారో చెప్పాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి



మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రాష్ట్రానికి, జిల్లాకు ఏం చేసిందో చెప్పాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి అన్నారు. నగర సమీపంలోని శాంతి కన్వెన్షన్ హాల్‌లో శక్తి కేంద్రప్రముఖ్‌లు, బూత్ అధ్యక్షులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులు అర్ధాంతరంగా ఆగిపోయాయని విమర్శించారు. వంశధార, తోటపల్లి, మహేంద్రతనయ పనులు వేగవంతం చేస్తామని చెప్పినా అసలు పట్టించుకోలేదన్నారు. కిడ్నీ బాధితుల కోసం పలాసలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్‌కు కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూరుస్తోందని చెప్పారు. జిల్లాలో లక్షా ఎనిమిది వేల మందికి ఇళ్లు కేటాయిస్తే, ఎన్ని ఇళ్లు నిర్మించారని ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ నుంచి ఆమదాలవలస వరకు రోడ్డు నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన రూ.40 కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా జాతీయ రహదారుల నిర్మాణం, అభివృద్ధి కోసం జిల్లాకు కేంద్రం రూ.1400 కోట్లు కేటాయించిందని తెలిపారు. అమృత్ పథకం కింద జిల్లాలో 9,295 తాగునీటి కుళాయిలకు కేంద్రం నిధులు ఇచ్చిందన్నారు. ఆర్అండ్‌బి రోడ్ల నిర్మాణానికి రూ.83 కోట్లు కేటాయించిందని తెలిపారు. అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సరిగా వెచ్చించడం లేదని విమర్శించారు.

జగన్మోహన్‌రెడ్డి స్వపరిపాలనకు అగ్రతాంబూలం ఇచ్చి, సుపరిపాలనను మరిచిపోయారని విమర్శించారు. రాష్ట్రంలోని సహజ వనరులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక మాఫియా ఆగడాలు మితిమీరిపోయాయని, మరోవైపు మద్యం దోపిడీ సాగుతోందని ధ్వజమెత్తారు. సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు, నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఎంఎఫ్‌సి గోదాముల పూర్తికి చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎంఎఫ్‌సి (మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) గోదాములను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 ఎంఎఫ్‌సి గోదాముల వివరాలను పూర్తిస్థాయిలో అందించాలన్నారు. ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు పూర్తిగా చెల్లించినట్లు చెప్పారు. మిగిలిన పనులు పూర్తి చేస్తే వాటికి బిల్లులు చెల్లిస్తామన్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన గొడౌన్లు ఉపయోగానికి సిద్ధంగా ఉన్నాయా అని కలెక్టర్ ప్రశ్నించగా, విద్యుత్ పూర్తి కాలేదని మార్కెటింగ్ డిఇ కోటయ్య తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పర్సన్ ఇన్‌ఛార్జిలతో సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సహకార సంఘాల పనితీరును అడగ్గా, అన్ని అప్‌డేట్‌గా ఉన్నట్లు డిసిసిబి సిఇఒ వరప్రసాద్‌ను చెప్పారు.

జిల్లా సహకార అధికారి ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించి అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలో 36 సహకార సంఘాలు ఉన్నాయని తెలిపారు. ప్రాథమిక సంఘాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, నాబార్డు డిడిఎం వరప్రసాద్, చేనేత శాఖ డిఒ ఆర్.శేఖర్, మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై పెరిగిన దాడులు

టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎస్ రాజు



ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో దళితులపై దాడులు పెరిగాయని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎస్ రాజు విమర్శించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఎస్‌సి సెల్ ఆధ్వర్యాన శుక్రవారం దళిత శంఖారావం సభను నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. డేఅండ్‌నైట్ , పాలకొండ రోడ్డు, ఏడు రోడ్ల కూడలి మీదుగా టిడిపి కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో ఏడు వేల మంది దళితులపై దాడులు జరిగాయన్నారు. 28 మంది హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్యుడు సుధాకర్ మొదలు హోంమంత్రి నియోజకవర్గంలో యువకుడి ఆత్మహత్య వరకు దళితులపై దమనకాండ సాగిస్తున్నారని ఆరోపించారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా అంబేద్కర్ కల్పించిన హక్కులనూ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. దళితులపై ఇన్ని జరుగుతున్నా ఏనాడూ ముఖ్యమంత్రి జగన్ నోరు విప్పి మాట్లాడలేదన్నారు. దళితులకు టిడిపి ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తే, వాటిలో కొన్నింటినైనా కొనసాగించకుండా జగన్ ద్రోహం చేశారన్నారు. వైసిపి అంతం దళితుల పంతం కావాలని పిలుపునిచ్చారు.

మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి మాట్లాడుతూ దళితులకు సముచిత స్థానం కల్పించి ఉన్నత పదవులు కల్పించింది టిడిపి మాత్రమేనన్నారు. తనకు శాసనసభ స్పీకర్ పదవితో పాటు కే.శే బాలయోగికి లోక్‌సభ స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టిందని గుర్తుచేశారు. మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహన్ మాట్లాడుతూ దళితులపైనే అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఇటువంటి దుర్మార్గపు పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. శంఖారావంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణ, బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, కిమిడి రామమల్లిక్‌నాయుడు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తం, గోర సురేష్, రాష్ట్ర నాయకులు ఎస్.వి రమణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పని కల్పనపై ప్రత్యేక దృష్టి

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు



మాట్లాడుతున్న చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పని దినాల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు సిబ్బందికి సూచించారు. నగరంలోని డ్వామా కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉపాధి పని అడిగిన వారందరికీ పని కల్పించాలని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ఉపాధి పనులు చేపట్టాలని ఆదేశించారు. జాబ్‌కార్డుదారులు 75 శాతం సగటు పనిదినాల కల్పనకు లక్ష్యం నిర్దేశించారని, ఆ దిశగా సిబ్బంది దృష్టిసారించాలన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి సగటు వేతనం రూ.265 ఉండాలని, హౌసింగ్ 90 పనిదినాల కల్పనకు సంబంధించి సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. బినామీ మస్టర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లక్ష్యాల సాధనలో వెనుకబడిన వారికి వేతనాల్లో కోతలు విధిస్తామన్నారు. మండల స్థాయిలో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కూలీలకు సకాలంలో కూలి చెల్లింపుల దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ప్లాంటేషన్ పనుల్లో భాగంగా మునగ, ఆయిల్‌ఫామ్ సాగుకు రైతులకు రుణాలకు ప్రోత్సహించాలని, వ్యక్తిగత పళ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని ఆదేశించారు. పల్లె వనం పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి మండలంలోని 25 సెంట్ల విస్తీర్ణంలో పది రకాల మొక్కలు వేయనున్నట్లు తెలిపారు. సముద్రం, నదీ సంగమ ప్రాంతాల్లో మడ అడవుల పెంపకం దిశగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పంచాయతీకి సంబంధించి అక్కడ చేపట్టిన ఉపాధి హామీ పనుల విజయగాథలను ఈనెలాఖరుకు పంపించాలని స్పష్టం చేశారు. ప్లానింగ్ ప్రక్రియలో పనుల గుర్తింపును వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎపిడిలు మురళీకృష్ణ, కె.లోకేష్, పి.రాధ, శైలజ, కార్యక్రమ నిర్వహణ అధికారి కె.వి అప్పలనాయుడు, కార్యాలయ ఉద్యోగులు, టిఎలు పాల్గొన్నారు.

ఒక్క శాతం దరఖాస్తులే పెండింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ముసాయిదా ఓటర్ల జాబితా వెలువడిన నాటి నుంచి ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడంతో, ఒక్క శాతం దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ రోజు నుంచి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, లింగ నిష్పత్తి, ఓటర్ల నమోదు ప్రత్యేకంగా 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న, ఎస్ఎస్ఆర్ ఫారాలు తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనోమలిస్ పెండింగ్, ముసాయిదా జాబితాపై ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, రాజకీయ పార్టీల పెండింగ్ ఫిర్యాదులు, ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీ తదితర అంశాలను వివరించారు. ఇప్పటివరకు ఫారం-6, 7, 8కు సంబంధించి 28,413 దరఖాస్తులు రాగా, వాటిలో 30 రోజులు దాటిన పెండింగ్ దరఖాస్తులు 993 ఉన్నాయని తెలిపారు. వాటిని మాత్రమే ఇంకా పరిష్కరించాల్సి ఉందని చెప్పారు. మూడు వారాల్లో 45,567 దరఖాస్తులు రాగా 24,769 పరిష్కారమయ్యాయని తెలిపారు. 18 ఏళ్లు నిండిన 21,662 మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ప్రతి వారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి, వారంలో జరుగుతున్న ప్రగతిపై సమీక్షలో వివరిస్తున్నామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

25, 28న ఎన్నికల శిక్షణా శిబిరం



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సాధారణ ఎన్నికలు-2024 కోసం జిల్లాలో నియమించిన సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులకు మొదటి దశ ఎన్నికల శిక్షణా కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈనెల 25, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయా రోజుల్లో ఉదయం 10 గంటలకు సంబంధిత అధికారులంతా హాజరు కావాలని ఆదేశించారు. ఈనెల 25న శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నరసన్నపేట నియోజకవర్గాలకు చెందిన సెక్టార్ అధికారులు, 28న టెక్కలి, పలాస, ఇచ్చాపురం, పాతపట్నంకు సంబంధించిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్, ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు వారి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, ఏ ఒక్కరూ గైర్హాజరు కాకుండా చూడాలని స్పష్టం చేశారు.



సిఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న కృష్ణదాస్

ఆపన్నులకు సిఎం సహాయనిధి అండ

ప్రజాశక్తి- పోలాకి

ఆపన్నులకు అండగా సిఎం సహాయ నిధి నిలుస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. శుక్రవారం మబగాం క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఆరుగురు లబ్ధిదారులకు రూ. 35 లక్షలు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపిలు ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగి నాయుడు, వాన గోపి, జెడ్‌పిటిసి చింతు రామారావు, జెసిఎస్ కన్వీనర్లు ధర్మాన జగన్, సురంగి నరసింగరావు, కణితి సత్తిబాబు, కణితి కృష్ణారావు, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, చింతాడ ఉమ, వైస్ ఎంపిపిలు తంగి మురళీ, పాగోటి రాజారావు, సర్పంచ్ బురెల్ల శంకర్ పాల్గొన్నారు.

కృష్ణదాస్‌కు దళిత నాయకుల సత్కారం

ప్రజాశక్తి- పోలాకి

జలుమూరు మండల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దళితులకు కేటాయించి జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ దళిత పక్షపాతిగా నిలిచారని నరసన్నపేట నియోజకవర్గ దళిత నాయకులు పెరుమాళ్ళ తవిటినాయుడు, సతివాడ రామనాయుడు, మచ్చ గణేష్, కల్లేపల్లి లక్ష్మణరావు పేర్కొన్నారు. శుక్రవారం మబగాంలో కృష్ణదాస్‌కు దుశ్శాలువతో సత్కరించారు. వారితో పాటు ఎంపిపి వాన గోపి, వైస్ ఎంపిపి తంగి మురళీ, దాము మన్మధరావు, పైడి విఠల్, ధర్మాన జగన్, బగ్గు లక్ష్మణరావు ఉన్నారు. అలాగే నరసన్నపేట మేజర్ పంచాయతీలో ఇఒగా బాధ్యతలు చేపట్టిన సవర చిన్నారావు మబగాం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మాన కష్ణదాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు సర్పంచ్ బి.శంకర్ ఉన్నారు.



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

మెగా వాటర్‌ప్లాంట్ పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో మర్రిపాడు (సి) పంచాయతీ ఉల్లాసపేట వద్ద చేపడుతున్న మెగా వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలించారు. రూ.750 కోట్లుతో నిర్మాణం చేపట్టిన పనులకు సంబంధించి మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజిని, ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసరావు, జెఇ నిరంజన్, మెగా ఇంజనీర్ వినోద్ కుమార్, విఆర్‌ఒలు అన్నాజీరావు, హిమగిరి, కాళిదాసు మెగావాటర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తార్ బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కెవి టౌన్-1 ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించుటకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సొట్టవాని పేట, టిజిఆర్ నగర్, ఎఫ్‌సిఐ, కె. మన్నయ్యపేట, టి.మన్నయ్యపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ప్రకటనలో తెలిపారు. ఈ అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించాలి



మెళియాపుట్టి : పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో బాణాపురం సచివాలయంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో శుక్రవారం ఎపికి జగన్ ఎందుకు కావాలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం రైతుల కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు భరోసా వంటి పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం వచ్చినట్లయితే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి సభ్యులు గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, మండల పార్టీ కన్వీనర్ పల్లి యోగి, కరణం శశిభూషణరావు, ప్రసాదరావు, జయముని, బాబురావు, ఎపిఎం లలిత, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: నిరంతం ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించే సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. రాష్ట్రానికి జగనన్నే ఎందుకు సిఎం కావాలి కార్యక్రమంలో భాగంగా పలు కాలనీల్లో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి మాట్లాడుతూ



కోటబొమ్మాళి : సంక్షేమ పథకాలను వివరిస్తున్న సర్పంచ్

గత టిడిపి ప్రభుత్వ పాలనకు, ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి పాలనకు తేడా చూసుకొని ప్రజలు తీర్పు చెప్పాలన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు తెలుగుదేశం, జన సేన పార్టీలు ముందుకు వస్తున్నాయని, వీరి మోసపూరిత వాగ్దానాలను నమ్మిమోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్య క్రమంలో వైసిపి నాయకులు రాజాపు లక్ష్మి, బెవర కృష్ణారావు, పాత్రుని లోకేష్, అనపాన కన్నయ్య, ఇర్రీ చిరంజీవి, బొంతల కృష్ణారావు, పొట్నూరు గోవిందరావు, సిఎఫ్ జీరు భవాని, వాలంటీర్లు భవాని, ఇందుమతి పాల్గొన్నారు.



పురంధేశ్వరికి స్వాగతం పలుకుతున్న ఎన్ఇఆర్

పురంధేశ్వరికి ఘన స్వాగతం

రణస్థలం రూరల్: బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షురాలుగా తొలిసారి జిల్లాకు వస్తున్న సందర్భంగా విజయనగరం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు మండల కేంద్రంలో రామతీర్థాలు కూడలి వద్ద శుక్రవారం ఘన స్వాగతం పలికారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు లెంక అప్పలనాయుడు, ఎస్.నాగేశ్వరరావు, మన్నె కృష్ణానందం, గురాల రఘునాథ్, జి.త్రినాధరావు, కాయిత రమణ, దుక్క ఆదినారాయణ, పి.వి.రత్నం, ఆకెళ్ళ సూరిబాబు, మన్నె సురేష్ కుమార్, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

ఎచ్చెర్ల: చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని ఎస్-ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కేశవరాయుని పాలెంలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ జిల్లాస్థాయి బాల్ బాడ్మింటైన్ ఛాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, ఇప్పటికే అన్ని రకాల క్రీడలకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై మక్కువ పెంచుకొని ఉన్నత లక్ష్యాలు సాధించే దిశగా కృషి చేయాలన్నారు. విద్యకు ఎన్ని అవకాశాలు కల్పిస్తున్నారో అదే స్థాయిలో క్రీడలకు గొప్ప అవకాశాలు కల్పిస్తున్నారని, భవిష్యత్‌లో మీరంతా గొప్ప క్రీడాకారులుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.



క్రీడాకారులతో శ్రీనివాసరావు

సాగునీరు ఇప్పించరూ!

ప్రజాశక్తి- ఆమదాలవలస

పంట పొలాలకు సాగునీరును ఇప్పించాలని మండాది గ్రామ రైతులు స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. శుక్రవారం మండలంలోని శ్రీనివాసాచార్యులపేట పంచాయతీ పరిధిలోని మండాది, ఈసర్లపేట గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండాది గ్రామ రైతు అమలాపురం నాగేశ్వరరావు మాట్లాడుతూ 30 ఎకరాల భూమికి సాగునీరు అందడం లేదని, ప్రతి ఏటా పంటలు పండడం లేదని, పంట నష్టాన్ని అధికారులు నమోదు చేయడం లేదని స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని స్పీకర్ ఆదేశించారు. అదే గ్రామానికి చెందిన అంబటి పోతురాజు గతంలో ఉపాధి హామీ పనులకు వెళ్తుండగా తమ గ్రామ మెయిన్ రోడ్‌లో లారీ ఢీకొన్న సంఘటనలో నలుగురు మహిళలు మృతి చెందారని అందులో తన భార్య సత్తెమ్మ కూడా మృతి చెందిందని, ముగ్గురు మహిళలకు



సాగునీటి సమస్యను స్పీకర్‌కు వివరిస్తున్న నాగేశ్వరరావు

నష్టపరిహారం అందిందని తన భార్య చనిపోయినప్పటికీ నేటికీ ఎటువంటి పరిహారం అందలేదని స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. అంగన్వాడి సెంటర్ అద్దె భవనంలో కొనసాగుతున్నదని శాశ్వత భవనం నిర్మించాలని అంగన్వాడీ కార్యకర్త స్పీకర్‌కు తెలిపారు. గ్రామానికి, స్మశాన వాటికకు రహదారిని నిర్మించాలని ఈసర్ల పేట గ్రామస్తులు స్పీకర్‌ను కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి గురుగుబెల్లి ప్రభాకరరావు, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, మండల ఎఒ మెట్ట మోహనరావు, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు, ట్రాన్స్‌కో ఎఇ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బెంతుఒరియాలు

శాశ్వత పరిష్కారం చూపించాలి

కవిటి: తమ సామాజిక వర్గానికి దశాబ్దాలుగా జరుగుతున్న అన్యాయానికి ముగింపు పలికి, బెంతు ఒరియ సామాజిక వర్గ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని బెంతు ఒరియ యువతీ, యువకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతామణి అమ్మవారి గుడి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. బెంతు ఒరియాలకు అన్యాయం చేస్తున్న కలెక్టర్ డౌన్‌డౌన్, తహశీల్దార్ డౌన్‌డౌన్ అంటూ తహశీల్దార్ కార్యాలయ ద్వారం వద్ద బైఠాయించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ రామచంద్రరావుకు అందించారు. ఈ సందర్భంగా బెంతు ఒరియా ప్రతినిధులు సుమన్ బిసాయి, కృష్ణ బిసాయి మాట్లాడుతూ బెంతు ఒరియాలకు కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయకపోవడంతో అనేక మంది విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారని, తమ సామాజిక వర్గానికి చెందిన యువకులు ఉన్నత కొలువులు సాధించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో ఇటీవల జరిగిన ఎపిసెట్, పాలీసెట్, లాసెట్, పలు డిప్లొమా కోర్సుల్లో బెంతు ఒరియాలు స్థానం సంపాదించ లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ విషయంలో రెవెన్యూ సిబ్బంది మొండి వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి తమ భావితరాలకు భవిష్యత్ అందివ్వాలని కోరారు. బెంతు ఒరియాలకు సిజిసి నెంబరుతో కూడిన ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ మంజూరు చేసి 2023 - 24 విద్యా సంవత్సరంలో నష్టపోయిన విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుదిస్టి మజ్జి, బృందావన్ బిసాయి, శంకర్ సాహు, జయసన్ బిసాయి, ప్రేమ్ సాహు, బెంతు ఒరియా యువతీ యువకులు పాల్గొన్నారు.

మార్కెట్ ధర కల్పించడమే లక్ష్యం

బూర్జ: పొలంబడి ద్వారా రైతులు పండించిన ఉత్పత్తులకు మేలైన మార్కెట్ ధర కల్పించేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ అధికారి పి.వెంకట్రావు అన్నారు, శుక్రవారం మండలంలోని పాలవలస, అన్నంపేట గ్రామాల్లో పర్యటించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. 55 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు పొలంబడి ద్వారా మేలైన యజమాన్య పద్ధతులు పాటిస్తున్న రైతులు పంటలను రైతులు వారీగా నమోదు చేసిన రికార్డులను బృందం పరిశీలించింది. పొలంబడి ద్వారా రైతుల పండించిన ఉత్పతులకు మేలైన మార్కెట్ ధర కల్పించబడుతుందని జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ సిహెచ్ వెంకటరావు, కొత్తూరు ఎడిఎ రాజగోపాలరావు తెలియజేసారు. కార్యక్రమంలో మండల ఎఒ రాజేశ్వరరావు, వనసహజ రైతు ఉత్పత్తి దారుల సంఘం ప్రతినిధి గణేశ్వరరావు, శివ ప్రసాదరావు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా రైతు సమావేశాలా?

రైతులు లేకుండా సమావేశాలు నిర్వహించడం పలు విమర్శలకు దారి తీస్తున్నాయి. ఆర్ఫ్ సంస్థ వన సహజ రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కేవలం ఒక్క రైతు మాత్రమే వుండడం గమనార్హం. ఆధికారులు ప్రకటనలకు జరుగుతున్న కార్యక్రమాలకు సంబంధం లేకుండా వున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి- మందస

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అందులో భాగంగానే గౌతు లచ్చన్న బలహీనవర్గాల సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించడం జరిగిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మందస మండలం హరిపురం నరేష్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ, పుజ్జులోన సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గౌతు శిరీష ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తూ ప్రత్యామ్నాయంగా వివిధ ప్రైవేట్ సంస్థల్లో పని చేయడం ద్వారా ఉపాధి కలుగుతుందన్నారు. జాబ్



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న శిరీష

మేళాకు 200 మంది నిరుద్యోగులు హాజరుకాగా వివిధ సంస్థల్లో పని చేసేందుకు 50 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో పుజ్జులోన సంస్థ హెచ్‌ఆర్ ప్రవీణ్, సంస్థ ప్రతినిధులు రంజిత్తు, మందస మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, దాసరి తాతారావు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కవిటి

మండలం యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం జాడుపూడి ఆర్ఎస్ ఎంపిపి పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ఎల్.బాబురావు ఆధ్వర్యంలో ఎం.మురళీ ప్రకాష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఈ ఎన్నికలో కె. కృష్ణారావు గౌరవ అధ్యక్షుడుగా, జి.జానకిరావు అధ్యక్షుడుగా, ఐజి త్రినాధరావు, వి.రమ సహాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆర్.జగదీశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా, మనోజ్ మహరాణ కోశాధికారిగా, వి.సీతంనాయుడు సిపిఎస్ కన్వీనర్‌గా, ఎస్.శాంతారావు కో-కన్వీనర్‌గా ఎంపికయ్యారు.



పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

డీలర్ మృతికి సంతాపం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పల్లిసారధి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ బెలమర మోహనరావు కిడ్నీ వ్యాధితో ఇటీవల మృతి చెందారు. శుక్రవారం మృతుని కుటుంబాన్ని సిపిఎం నాయకులు బి.ఆనందరావు, ఎన్.మోహనరావు కలిసి తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. మృతుని భార్య విజయను, కుటుంబాన్ని ఓదారుస్తూ, సానుభూతిని తెలియజేశారు. కిడ్నీ జబ్బు ఉద్దాన్ని పీడించడమే కాకుండా పల్లపు ప్రాంతాల్లో కూడా విస్తరిస్తుందని, రోగులు పెరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మృతుడు ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వాడని, అతని కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఆర్థిక సహాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కె.సి రెడ్డి

నిస్వార్థ సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఉద్యోగి చేసిన నిస్వార్థ సేవలే గుర్తింపునిస్తాయని ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి డైరెక్టర్‌గా పనిచేసిన పి.జగదీశ్వరరావు వీడ్కోలు సభను శుక్రవారం నిర్వహించారు. సిబ్బందితో కలిసి ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకడమిక్ బ్లాక్ ఆడిటోరియం, స్టాఫ్ కోసం క్వార్టర్ నిర్మిస్తున్నామని తెలిపారు. భవన నిర్మాణాల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వెంకటగోపాల ధన బాలాజీ, ఓఎస్‌డి ఎల్.డి సుధాకర్‌బాబు, ఎఒ మునిరామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఖైదీలకు ఉచిత న్యాయసహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆద్వర్యాన అందించనున్నట్లు కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. జిల్లా జైలును శుక్రవారం సందర్శించారు. ఖైదీలకు అందుతున్న వసతులను వ్యక్తిగతంగా పర్యవేక్షించి ఖైదీలతో వ్యక్తిగతంగా మాట్లాడారు. ఎవరికైనా న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేకపోతే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా కేసులు ఉచితంగా నడిపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుట్ట అంజనీ కుమార్, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పైడి హర్షవర్ధన్, జైలర్లు దివాకర్ నాయుడు, ఉదయ్‌భాస్కర్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

అప్రజాస్వామిక అవినీతికర ఫాసిస్టు బిజెపిని ఓడించే లక్ష్యసాధనలో మొదటి మెట్టు ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఎపి సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు కోనారి మోహనరావు, సనపల అన్నాజీరావులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో తపాలా కేంద్ర కార్యాలయం ఎదుట పోస్టర్లను ప్రదర్శిస్తూ రైతులకు పంపిణీ చేశారు. ఆహారభద్రతకు హామీ ఇవ్వాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను సార్వత్రికం చేయాలని తదితర 20 డిమాండ్లతో రానున్న సోమ, మంగళవారాల్లో నిరవధిక ధర్నా జరుపుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బొడ్డేపల్లి మోహనరావు, బొడ్డేపల్లి జనార్దనరావు, కె.నందికేశ్వరరావు, ఎం.సురేష్, బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్థల కేటాయింపును రద్దు చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో బాహుదా నది వద్ద పాతాళ ఈశ్వర ఆలయం రోడ్డులో చర్చికి కేటాయించిన స్థలం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం నుంచి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనేక మంది భక్తులు దీక్షా చేసుకుంటూ ఉండే పాతాళ ఈశ్వర ఆలయానికి సమీపంలో చర్చికి స్థలం కేటాయింపు చేయడం దారుణమని, వీరికి మారోచోట స్థలం కేటాయింపు చేయాలని స్థానిక రెవెన్యూ అధికారి గురు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆసీ చిరంజీవులు రెడ్డి, బుద్దల నిర్మలా రెడ్డి, కొండ శంకర్ రెడ్డి, కాళ్ల అప్పారావు, సంజీవ రెడ్డి, కుర్మారావు రెడ్డి, బచ్చు జగన్, మన్యల విఘ్నేష్, దక్కత విశ్వనాథ్ రెడ్డి, దొరబాబు రెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె నోటీసు అందజేత



పలాస : సిడిపిఒకు సమ్మె నోటీసును అందజేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- పలాస

డిసెంబర్ 8న అంగన్వాడీల నిరవధిక సమ్మె చేయనున్నామని అంగన్వాడీ యూనియన్ నాయకులు కె జ్యోతి, సునీత అన్నారు. కాశీబుగ్గ ఐసిడిఎస్ కార్యాలయంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి డి.శార్వాణికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తున్న నేపథ్యంలో సమ్మె చేసేందుకు సిద్ధం అవుతున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీతంలో సగం పింఛన్‌గా ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని కోరారు. రోజుకో యాప్‌తో అంగన్వాడీలను పనిఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకే సమ్మె చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు ఆర్. అప్పలనరసమ్మ, ఎం.కరుణ, ఎన్ జానకి, కె.అన్నపూర్ణ, ఇందుమతి పాల్గొన్నారు.

కొత్తూరు: అంగన్వాడీల వేతనాలు, గ్రాడ్యుటీ అమలు, సమస్యలు పరిష్కరించాలని నిరవదిక సమ్మె చేస్తున్నట్లు అంగన్వాడీలు తెలిపారు. అంగవాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మిక సంఘం నాయకులు ఎస్.ధనలక్ష్మి, కె.బోదెమ్మ, లక్ష్మి, సిర్ల.ప్రసాద్‌లతో కలిసి ఐసిడిఎస్ కార్యాలయంలో శుక్రవారం సమ్మెనోటీస్‌ను పిఒ విమలకుమారికి అందజేశారు. కార్యక్రమంలో నిర్మల, పి.లక్ష్మి, ఉత్తర, విజయ, సరోజిని, సరస్వతి, మధురవేణి, అరుణ ఉన్నారు.



కొత్తూరు : పిఒకు నోటీసును అందజేస్తున్న నాయకులు

బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- పలాస

బాల్య వివాహాలపై దృష్టి సారించాలని ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు అన్నారు. కాశీబుగ్గ స్త్రీనిధి భవనంలో శుక్రవారం వెలుగు ఆధ్వర్యంలో లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారంలో భాగంగా వెలుగు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి డిసెంబర్ 25 వరకు నెల రోజులు పాటు గ్రామాల్లో లింగ వివక్షత, బాల్య వివాహాలు, రక్త హీనత, ఆడపిల్లల చదువుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వారానికి ఒకసారి మండల స్థాయిలో ఒక్కొక్క అంశంపై సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. వీటిపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత వెలుగు అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు వెలుగు, అంగన్వాడీ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ అధికారులతో పాటు సచివాలయం ఉద్యోగులు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో వెలుగు ఎపిఎం బి.మల్లేశ్వరరావు, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి డి.శార్వాణి, ఇఒ అప్పలనరసమ్మ, సిసిలు వెంకటేశ్వరరావు, నాగమ్మ, రేణుక పాల్గొన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

రణస్థలం: మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం చూపుడు వేలును విరగ్గొట్టిన దుర్మార్గమైన సంఘ విద్రోహశక్తులపై చర్య తీసుకోవాలని ఎపి దళిత మహాసభ రణస్థలం మండల శాఖ అధ్యక్షులు పల్ల నీలయ్య డిమాండ్ చేసారు. ఈ చర్య దేశ ద్రోహం మరియు రాజ్యాంగాన్ని అవమానించడమే అవుతుందన్నారు. తక్షణమే పోలీస్ వారు ఈ దుశ్చర్యపై సుమోటోగా కేసు నమోదు చేసి బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎపి దళిత మహాసభ మండల శాఖ ఆధ్వర్యంలో దళిత సంఘాలు డిమాండ్ చేసాయి. కార్యక్రమంలో దళిత మహాసభ మండల శాఖ అధ్యక్షులు పల్ల నీలయ్య, గౌరవ అధ్యక్షులు సాకేటి పోతయ్య, ప్రధాన కార్యదర్శి కుప్పిలి పైడిరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి దుక్క ఆదినారాయణ పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి- సోంపేట



మిన్నారావు (ఫైల్)

బారువ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రైలు ఢీకొని గొనకపాడు గ్రామానికి చెందిన తాడి మీన్నారావు (28) మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోనకపాడుకు చెందిన మిన్నారావు రైల్వేస్టేషన్ అవతల ఉన్న తన పొలానికి వెళ్లే క్రమంలో ట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానికులు గమనించి స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు పలాస రైల్వే పోలీసులకు తెలియజేశారు. మృతుడికి తల్లితో పాటు ఇద్దరు అక్కలు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పలాస రైల్వే పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం



శిరీష

ఆమదాలవలస: వివాహిత నారా శిరీష అదృశ్యమైందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వై. కృష్ణ తెలిపారు. మండల పరిధిలోని కొత్తరోడ్ జంక్షన్ వద్ద నివసిస్తున్న నారా శిరీష ఎల్ఎన్‌పేట మండలంలో మ్యాథ్స్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ రణస్థలం మండలం జీరుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఇటీవల బదిలీ అయ్యింది. అదే స్కూల్లో పనిచేస్తున్న వేరే టీచర్‌తో పరిచయం ఏర్పడి అతనితో చనువుగా ఉండేది. ఈమెకు పాటలు రాసే అలవాటు ఉండటంతో వీరిద్దరూ తరచూ విశాఖపట్నం వెళ్లివస్తూ ఉండేవారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం స్కూల్ నుంచి కొత్తరోడ్డులో ఉన్న ఇంటికి వచ్చి అక్కడి నుంచి ఆమదాలవలసలోని డాబాలవారి వీధిలో ఉన్న తన కన్నవారి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికి చేరకపోవడంతో మరుసటి రోజు ఆమె పనిచేస్తున్న స్కూల్‌కు వెళ్లి విచారణ చేయగా ఆమెతో సన్నిహితంగా ఉన్న ఉపాధ్యాయుడు కూడా సెలవులో ఉన్నట్లు తెలిసిందని శిరీష భర్త జవ్వాది మధు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.





దొంగతనాలు జరిగిన షాపులు

బాబోయ్ దొంగలు

ఆమదాలవలస: పట్టణ పరిధిలో గత ఆరు నెలల వ్యవధిలో వివిధ ప్రాంతాల్లో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో పట్టణ ప్రజలు దొంగల బాబోయ్ దొంగలంటూ హడలెత్తి పోతున్నారు. తాజాగా గురువారం అర్ధరాత్రి మెయిన్ రోడ్డులో ఉన్న నాలుగు షాపుల్లో ఒకేసారి దొంగతనం జరగడంతో ప్రజలను మరింత భయాందోళనకు గురిచేస్తుంది. సర్కిల్ కార్యాలయ పరిధిలో పోలీసులు అందరూ అందుబాటులో ఉన్నప్పటికీ ఈ ప్రాంతంలో వరుస దొంగతనాలు జరుగుతున్నప్పటికీ నివారించడంలో పోలీసులు విఫలమవుతున్నారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో చంద్రయ్యపేట, సొట్టవానిపేట, పలు దేవాలయాల్లో వరుసగా దొంగతనాలు జరిగిన సంఘటనలు మరువక ముందే మెయిన్ రోడ్‌లో ఉన్న ఎస్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్, శివ బాలాజీ ఎరువులు షాపు, విశ్వనాథ్ అండ్ కో, వంట నూనెల షాపు, మహదేవ్ ఎలక్ట్రికల్ షాపుల్లో గురువారం అర్ధరాత్రి దొంగలు దొంగతనాలు చేయడం పట్ల పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో ఖరీదైన బంగారం షాపుతో పాటు మూడు బ్యాంకులు కూడా ఉన్నాయని, అలాగే లాడ్జీలు కూడా ఉన్నాయని గతంలో పలు అసాంఘిక కార్యక్రమాలు జరిగాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టి ప్రజల భయాందోళనలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కంచిలి: మండలంలోని మకరాంపురం జాతీయ రహదారి ఆదివారం సంత జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జాడుపూడి గ్రామానికి చెందిన రాయల దేవకి (48) అనే మహిళ మృతి చెందింది. ఈ మేరకు కంచిలి ఎస్ఐ బాలరాజు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాడుపూడి గ్రామానికి చెందిన రాయల ప్రకాష్, తన తల్లిని తీసుకొని జాడపూడి నుంచి ద్విచక్ర వాహనంపై కంచిలి వస్తున్నాడు. అదే దారిలో భిన్నల కొత్తూరుకు చెందిన వల్లభరావు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. మకరాంపురం ఆదివారం సంత జంక్షన్ వద్దకు వచ్చేసరికి వల్లభరావు ఎటువంటి సిగ్నల్స్ వేయకుండా అకస్మాత్తుగా ద్విచక్ర వాహనాన్ని వేగంగా కుడివైపు మళ్లించాడు. దీంతో పక్కనుండే వస్తున్న ప్రకాష్ అదుపుతప్పి వల్లభరావు బైకును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో దేవకి రోడ్డుపై పడిపోవడంతో తలకి బలమైన గాయమైంది. అధిక రక్తస్రావం జరగడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనపై మృతురాలి కుమారుడు ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. మృతురాలికి కుమారుడు ప్రకాష్‌తో పాటు ఒక కుమార్తె ఉన్నారు.



దేవకి (ఫైల్)



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బాలలను పనిలో పెట్టుకోవడం నేరమని మానవ అక్రమ నిరోధక విభాగం అధికారి ఎస్.కేశవరావు అన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛ-4లో భాగంగా శుక్రవారం మండలంలో బాలల రెస్క్యూ బృందం నిర్వహించిన దాడుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్లలోపు బాలలను పనిలో పెట్టుకొన్న యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఇద్దరు బాలలను గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి తదుపరి చర్యలు నిమిత్తం బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశ పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పూండి లో మానవ అక్రమ రవాణా వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ విభాగం కౌన్సిలర్ సీతారాములు, లేబర్ ఆఫీసర్ విజయ్ కుమార్, చైల్డ్ వెల్ఫేర్ పోలీస్ ఆఫీసర్ కృష్ణారావు, హెల్ప్‌లైన్ సభ్యులు డి.బి.రాజు, గణపతిరావు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 బాలికల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో సత్తాచాటిన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరు విద్యార్థినులు ఇటీవల చిత్తూరుజిల్లా బంగారుపల్లిలో 09 నుంచి 11 వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో కూడా సత్తాచాటి శ్రీకాకుళం జిల్లా రజిత పథకాన్ని కైవసం చేసుకుంది. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరు నుంచి ఎర్ర భవాని, దున్న మీనా జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రతిభ కనపర్చారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.సరోజిని, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. అలాగే జాతీయ స్థాయి పోటీలకు జాతీయ జట్టులో స్టాండ్ బైగా ఎర్ర భవాని ఎంపికయ్యారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

46 అంగన్వాడీ కేంద్రాలు ఆధునికీకరణ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పలాస, వజ్రపుకొత్తూరు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రాంతాల్లో 46 అంగన్వాడీ కేంద్రాలు ఆధునికీకరణ చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయని కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి శార్వాణి తెలిపారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంగన్వాడీ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ముందుగా నాడు నేడు అధికారులతో సూపర్‌వైజర్ పరిశీలించి తమకు నివేదిక అందజేయాలన్నారు. సమావేశంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు గంగమ్మ, లత, సరస్వతి, ధనలక్ష్మి, అరుణ, సునీత, నాడు నేడు ఎఇ రాజేంద్ర రెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా మైదానం పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం ఐసిసి క్రికెట్ క్లబ్ నెట్స్, సురంగి రాజా వారి మైదానం పరిశీలనకు ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ క్రీడా మైదానాలు అభివృద్ధి సలహాదారులు, పూర్వపు రంజీ క్రికెట్ ప్లేయర్ ఎమ్మెస్ కుమార్, శ్రీకాకుళం క్రికెట్ సంఘం మెంటర్ ఇలియాజ్ అహ్మద్, లాల్, స్పెషల్ కోచ్ కృష్ణమోహన్ బృందం పరిశీలించింది. ఇచ్ఛాపురం విచ్చేసి ఇక్కడ జరుగుతున్న క్రికెట్ అభివృద్ధిని ప్రశంసిస్తూ భవిష్యత్‌లో ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసిసి క్రికెట్ క్లబ్ గౌరవాధ్యక్షులు దాసరి రాజు, ఇచ్ఛాపురం సబ్ సెంటర్ సభ్యులు అలీమ్ ఖాన్, భత్తుల రమణ, బత్తిన నాగరాజు, కోచ్ గోపి, క్రికెట్ క్లబ్ సలహాదారులు కుమార్, సరోజ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయానికి శంకుస్థాపన

నౌపడ : మండలం నౌపడలో టిడిపి కార్యాలయం నిర్మాణానికి నాయకులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి, చెన్నూరు గౌరి ప్రసాద్, బాబ్జి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంటనే నిర్మాణపనులు ప్రారంభించి త్వరితగతన కార్యాలయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

బాబుతోనే రాష్ట్ర భవిష్యత్


కోటబొమ్మాళి: పోస్టర్లు అందజేస్తున్న అప్పలరాజు

ప్రజాశక్తి- లావేరు

రాష్ట్రానికి మాజీ సిఎం నారా చంద్రబాబుతోనే భవిష్యత్ అని, రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని గోవిందపురం మాజీ ఉప సర్పంచ్ ఇజ్జు బాబూరావు అన్నారు. శుక్రవారం గోవిందపురం, ఇజ్జడాపాళెం గ్రామాల్లో ఇంటి ఇంటికి తిరుగుతూ సూపర్ సిక్స్ ఎన్నికలు మేనిపోస్టను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిక్కల ఏళ్లన్నదొర, రౌతు తాతారావు, గట్టెం సన్యాసిరావు, ఇజ్జడా సత్యం, అప్పల గురువులు, ఇజ్జు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రాష్ట్ర ప్రజలు వైసిపి పాలనతో విసుగుచెంది మార్పు కోరుకుంటున్నారని టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ ఎంపిటిసి హనుమంతు అప్పలరాజు అన్నారు. మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ, హరిశ్చంద్రపురం గ్రామంలో స్థానిక టిడిపి నాయకులతో కలిసి శుక్రవారం భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అందించబోయే పథకాలను ప్రమాణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లింగుబారి రామప్పడు, డోకి నానాజీ, గంగిట్ల అప్పన్న, ఉప్పాడ సింహాచలం, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని మూలసవళాపురం పంచాయతీ పరిధిలోని తురకపేట గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మండలంలోని హనుమంతపురం గ్రామంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని అక్కులపేట గ్రామంలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు ఊసవాని పేటలో మాజీ టిడిపి కౌన్సిలర్ ఇందిరాపు విశ్వనాథం ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తాడేల వెంకటరమణ, గదిలి మల్లేశ్వరరావు, కూన సంజీవరావు పాల్గొన్నారు.


లావేరు : పోస్టర్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

రబీలో ఆరుతడి పంటలు వేసుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి


విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎడిఎ

రబీలో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, ఎడిఎ భవాని శంకర్ రైతులకు సూచించారు. నీరు అందించడం జరగదని రైతులు ఇది గమనించి వరి పంట ఎట్టి పరిస్థితుల్లో రబీ కాలంలో పండించకూడదని తెలియజేశారు. అనంతరం రైతులకు ఖరీఫ్ కాలంలో ధాన్యం కొనుగోలు విధానంపై తెలియజేశారు. జెడ్‌పిటిసి ఎండయ్య మాట్లాడుతూ రైతు సోదరులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి రబీ కాలంలో ఆరుతడి పంటలు మాత్రమే పండించుకొని అధిక ఆదాయం పొందాలని కోరారు. అనంతరం వేరుశనగ విత్తనాలను 40శాతం రాయితీపై సిరియాకండి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు సరఫరా చేశారు. 30 కేజీల వేరుశనగ బస్తా రూ.1800 రైతులు చెల్లించి విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దాన కర్ణుడు, సర్పంచ్ ప్రతినిధి రామరాజు, సర్పంచ్‌లు ధర్మారావు, భాస్కరరావు, భాస్కరదాసు, వ్యవసాయ సహాయకులు ఝాన్సీ, పుష్ప పాల్గొన్నారు.

27న 30 గంటల మహాధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో చేపట్టే 30 గంటల మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షణ్ముఖరావు పిలుపునిచ్చారు. నగరంలోని పాత్రునివలసలో మహా ధర్నా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రతీ పేదవాని అకౌంట్లో రూ.15 లక్షల డిపాజిట్ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఆచరణలో విఫలమైందని విమర్శించారు.

అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్లకు రూ.రెండు లక్షల కోట్ల రాయితీలను అందించిన ప్రభుత్వం రైతుల రుణమాఫీలను, వడ్డీ రాయితీలు ఇవ్వకుండా అన్యాయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ సూర్యనారాయణ, చుక్క రాము, మత్స్య కార్మిక సంఘం నాయకులు నాగుల తవుడు, ఎఐటియుసి నాయకులు కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య కోర్సుల్లో ప్రవేశాలు

ప్రజాశక్తి - పలాస

పలాస డాక్టర్ వి.కణితీస్ ప్రభుత్వ ఐటిఐలో ఏర్పాటు చేసిన స్కిల్ హాబ్ సెంటర్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి నైపుణ్య కోర్సులు ప్రవేశ పెట్టామని కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి.సాయి శ్రీనివాస్ తెలిపారు. స్వల్పకాలిక కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 27 వరకు గడువు ఉందని, మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్, షీల్డ్ ఆర్క్ వెల్డింగ్, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి ఆపైన పాసైన విద్యార్హత కలిగిన 18 నుంచి 25 సంవత్సరాల లోపు గల పురుషులు తమ విద్యార్హత సర్టిఫికేట్లు, పాస్‌ఫోటో, ఆధార్ జిరాక్స్‌తో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 6301046329ను సంప్రదించాలన్నారు.

నాణ్యత గల చేపలకు అధిక ధర

ప్రజాశక్తి- ఆమదాలవలస


మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

చేపలు, రొయ్యలు అధిక పోషక విలువలు ఉన్నప్పటికీ నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే అధిక ధరలకు అమ్ముకోవడానికి వీలుంటుందని కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం కెవికెలో నాణ్యమైన చేపలను వినియోగదారులకు అందించడంలో సాంకేతిక పద్ధతులు అవ లంభించడానికి ఆత్మ పథకం ద్వారా రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మత్స్యశాఖాధికారి పి.వి శ్రీనివాసరావు మాట్లాడుతూ చేపలను దేశీయంగా మార్కెట్ చేయడానికి ప్రభుత్వం తరఫున ఫిష్ ఆంధ్ర బ్రాండ్‌తో అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆత్మ పథక సంచాలకులు డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో పంట అనంతరం చేపట్టాల్సిన చర్యలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, నాణ్యమైన చేపలు సరఫరా వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ, కెవికె శాస్త్రవేత్తలు ఎస్.నీలవేణి, బి.సునీత, మౌనిక, కిరణ్ కుమార్, మత్స్యశాఖ అధికా రులు సంతోష్, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం


శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

బాహుదా నది వద్ద రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం శ్రీ పాతాళ సిద్ధేశ్వర ఆలయం నుంచి రైల్వే టన్నెల్ వరకు రూ.10 లక్షలతో 15వ ఆర్థిక సంఘం నిధులు ద్వారా చేపడుతున్న రోడ్డు నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ నల్లి రమేష్, 17వ వార్డు ప్రతినిధి టెంక లోకేష్, చైర్‌పర్సన్ ప్రతినిధి పిలక సంతోష్ రెడ్డి, 19వ వార్డు ప్రతినిధి బొబ్బిలి నరసింహులు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కామేష్, పాతాళ సిద్ధేశ్వర ఆలయ పెద్దలు పాల్గొన్నారు.

బిసి పోస్టుమెట్రిక్ హాస్టల్ సందర్శన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం ఇతర వసతులు అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు ఆదేశించారు. నగరంలోని డైమండ్ పార్కు వద్ద గల బిసి పోస్టుమెట్రిక్ హాస్టల్‌ను శుక్రవారం సందర్శించారు. హాస్టల్ వంటశాల, ఆహార పదార్థాల తయారీ తదితర అంశాలను వ్యక్తిగతంగా పర్యవేక్షించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న వసతులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ త్రివేణి, న్యాయవాది ఇందిరా ప్రసాద్ హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మతం కన్నా మానవత్వం గొప్పది

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సమాజంలో మతం కన్నా మానవత్వం గొప్పదని, అటువంటి మానవత్వాన్ని నేర్పింది హింధూ ధర్మమని ప్రముఖ ప్రవచన కారులు తూర్పుగోదావరి జిల్లా బొబ్బర్లంకకు చెందిన శ్రీ సత్యానందగిరిస్వామి, తెనాలి అర్యాసమాజం ప్రధాన కార్యదర్శి మాఘం కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండలం చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు శ్రీరామక్షేత్రంలో జరుగుతున్న చాతుర్మాసవ్రత ముగింపు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సత్సంగ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇతర మతాల జోలికి వెళ్లకూడదని ,కేవలం హింధుధర్మం మాత్రమే ప్రపంచానికి శాంతిని నేర్పుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 4వేలు మందికి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అనుష్టానందస్వామి, ఊడికలపాడు శ్రీరామకృష్ణ రమణాకరుణ, సనపల కరుణ్‌కుమార్, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, చీపుర్లపాడు ఎంపిటిసి బొడ్డు అప్పన్న పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చక్రవర్తి

ధనలక్ష్మి బ్యాంకు 97వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి రోడ్డులోని ధనలక్ష్మి బ్యాంకు 97వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. బ్యాంకు ఖాతాదారులు బి.ఎస్ చక్రవర్తి, బి.సత్యమూర్తి, జానకిరామ్, చిన్నారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఎం.తాతారావు మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. డాక్టర్ కేర్ హోమియోపతి వైద్యులు కోమలిరెడ్డి బృందం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

అన్నదానం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

.మండలంలో శివసాగర్ బీచ్‌లో శ్రీ నీలకంఠేశ్వర ఆలయం వద్ద బాతుపురం, పెదవంక భక్తభజన మండలి ఆధ్వర్యంలో క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మందికి అన్న దానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు

బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

బాల్య వివాహాలు జరిపించినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని టిడిపి కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం 22 వార్డులో బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన సదస్సు నిర్వహించారు. దిలీప్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు అరికట్టడం అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ టి.సుమిత, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంపై సమీక్ష

ప్రజాశక్తి- మెళియాపుట్టి

స్పందనలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారునికి సమగ్ర సమాచారం అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ టి. భవాని శంకర్ అధికారులకు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకుమారి, ఎంఇఒ పద్మనాభరావు, మండల పరిషత్ ఎఒ తిరుపతి పట్నాయక్, హౌసింగ్ ఎఇ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.